ఆత్మస్థైర్యానికి క్రీడలు దోహదం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

కూసుమంచి: క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి కూసుమంచిలో నిర్వహించనున్న పీఎస్ఆర్ లీగ్–2 క్రికెట్ పోటీల కరపత్రాలను శనివారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో పాలేరు నియోజకవర్గంలోని మండలాలతో పాటు సమీప ముదిగొండ, మోతె మండలాల క్రీడాకారులూ పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. అలాగే మండలంలోని ధర్మాతండా క్రాస్‌రోడ్ వద్ద గల శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం వద్ద తిరుపతమ్మ దీక్షాపరులకు ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని ఎంపీతో కలిసి ప్రారంభించారు.

● **అర్చక సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణ**

ఖమ్మంగాంధీచౌక్: దూప దీప నివేదన జిల్లా అర్చక సంఘం నూతన సంవత్సర ఆంగ్ల క్యాలెండర్లను నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. తొలుత అర్చక సంఘ ప్రతినిధులు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నావజ్జల ప్రసద శర్మ, జిల్లా సంఘం అధ్యక్షుడు మునగలేటి రమేష్‌శర్మ, కార్యదర్శి మరిగంటి భార్గవా చార్యులు, ఇంగువ పూర్ణానంద శర్మ, అనిపెద్ది యశ్వంత్ శర్మ, అవధానుల సీతారామశర్మ, గూడా పాండురంగశర్మ, కురుమేటి రామకృష్ణశర్మ, చిలుకూరి వెంకట నాగమూర్తి, గణపతిబొట్ల లక్ష్మీనారాయణశర్మ, కొత్తూరు రాజేశ్వరశర్మ, ఇంగువ సంగమేశ్వరప్రసాద్‌శర్మ, ఉదయ్ శర్మ, శివ జానకి శర్మ తదితరులు పాల్గొన్నారు.

● **సన్మానం..**

నేలకొండపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న దివ్యాంగుల ఆత్మగౌరవ భవనానికి రూ.20 లక్షల నిధుల మంజూరు చేయించినందుకు సంఘం నాయకులు, కోనాయిగూడెంలో కోనాయిగూడెంలో నిరంతర విద్యుత్ సరఫరాకు కొత్తగా సబ్‌స్టేషన్ మంజూరు చేసినందుకు మండల నాయకులు కలిసి వేర్వేరుగా క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య, మేకల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, భాస్కర్‌రావు, నాగరాజు, రామకృష్ణ, పుల్లయ్య, బాలయ్య, శ్రీను, సత్యనారాయణ, నాగలక్ష్మి, హుస్సేన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● **వినతి..**

ఖమ్మంరూరల్/ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడు నుంచి మంగళగూడెం వరకు నిర్మాణం చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయని, పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు మంత్రి పొంగులేటికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కన్నేటి నర్సింహారావు, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కన్నేటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ శనివారం మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టర్‌ను కలిసిన సీసీఎస్ ఉద్యోగులు



ఖమ్మంసహకారనగర్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసహకారనగర్: సీసీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి మొక్క బహూకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం పదేళ్లుగా చేస్తున్న ప్రజాస్వామ్యయుత పోరాటాన్ని కలెక్టర్‌కు వివరించారు. సీసీఎస్ ఉద్యోగుల పాత పెన్షన్ ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చర్ల శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలు ఎం.శ్వేత, కోశాధికారి జి.మోహన్, రాష్ట్ర కార్యదర్శులు మోబిన్ అహ్మద్, రాగి సురేష్, జాయింట్ సెక్రటరీ ఎస్‌డీ ఏకే జిలానీ, పబ్లిసిటీ సెక్రటరీ ఎం.పవన్, ఈసీ మెంబర్లు వి.రామారావు, గిరిజా కుమారి, డీవీ జాస్మిన్, కె.నాగేశ్వరరావు, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● **వినతులు..**

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంమామిళ్లగూడెం: జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు సైతం కలెక్టర్‌ను కలిసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుర్రి వినోద్‌కుమార్, బిందు ప్రసాద్, అలీ, హరీష్, ఖలీల్ పాషా, చంద్రశేఖర్, శేషు, యాకుబ్ పాషా, శాంతి, గౌసియా, నాగమణి, పార్వతి, ఇమమ్‌బీ, సరిత ఉన్నారు. అలాగే రైతు భరోసా కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలనే నిబంధనను తొలగించి రాష్ట్ర ప్రభుత్వమే వ్యవసాయం చేస్తున్న భూములను గుర్తించి వారికి రైతు భరోసా ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేసింది. ఆదాయ పన్ను చెల్లింపుదారులకు రైతు భరోసా మినహాయించాలనే ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని, వాణిజ్య పంటలతో పాటు ఉద్యానవన పంటలకూ రెండు విడతలుగా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మందనపు రామారావు, జిల్లా నాయకులు మల్లెంపాటి రమేష్, కవిడ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళాశాల సందర్శన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలను కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు శనివారం సందర్శించారు. తొలుత కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెయిలింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



కాలువలో నుంచి పొలాలకు వెళ్తున్న రైతులు, కూలీలు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువపై రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు కాలువపై రెయిలింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని తండా వాసులు కోరుతున్నారు. ప్రస్తుతం భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేయడంతో రైతులు పంట భూముల వద్దకు వెళ్లాలంటే కాలువ నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుందని, తమ సమస్యలు పరిష్కరించాలని వాపోయారు.

మెగా జాబ్‌మేళా



నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎంబీ గార్డెన్స్‌లో కాసాని ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు ఫౌండేషన్ చైర్మన్ కాసాని వీరేష్ తెలిపారు. సుమారు ఎనిమిది కంపెనీల్లో 350మందికిపైగా ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి టెక్నాలజీస్ చైర్మన్ శ్రీకాంత్ కొడిత్యాల, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయ రఘురామరాజు, జాబ్‌మేళా కో ఆర్డినేటర్ చందర్ పుల్లూరు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు గ్రేస్ సర్వీస్ సొసైటీ కానుకలు



రగ్గులు అందజేస్తున్న సొసైటీ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని పలు పాఠశాలలకు చెందిన మొత్తం 1,150 పిల్లలకు జీఎస్ఎస్ (గ్రేస్ సర్వీస్ సొసైటీ) ఆధ్వర్యాన శనివారం రగ్గులు, స్నాక్స్, బొమ్మలు అందజేశారు. నయాబజార్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎస్ రాజేంద్రనగర్ హెచ్ఎం గాయత్రి, జీహెచ్ఎస్ నయాబజార్ హెచ్ఎం సుధారాణి, జీఎస్ఎస్ తరఫున టి.జీవన్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రవాణాశాఖాధికారులు

ఖమ్మంక్రైం: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఆర్‌టీఓ వెంకటరమణ ఆధ్వర్యాన ఏఎంవీఐ స్వర్ణలత, ట్రైనీ ఏఎంవీఐ సుమలతలు ప్లకార్డులతో హెల్మెట్ ధరించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారిచే హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వెయింగ్ మిషన్ల వితరణ

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 46వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ చైర్మన్ బాణాల లక్ష్మణ్ శనివారం తన పుట్టినరోజు సందర్భంగా వెయింగ్ మిషన్లను వితరణగా అందించారు. చిన్నపిల్లలు, బాలింతలు వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పూసా రేణుక, బస్వ శ్రీలత, మణెమ్మ, సింగం అంజయ్య, దేవర వెంకన్న, సూదగాని మల్లికార్జున్, షేక్ జహీర్, తుపాకుల మధు, లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కరువైన విద్యాబోధన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

ఖమ్మం మామిళ్లగూడెం: కేజీబీవీ పాఠశాల్లో విద్యాబోధన కరువైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ఆరోపించారు. నగరంలోని సుందరయ్య భవనంలో నగర నాయకుడు వినోద్ అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి ఎస్ఎస్ఏ ఉద్యోగులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. గత 25 రోజులుగా వారు సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో పాఠశాలల్లో విద్యా కుటుంపడుతుందన్నారు. తాత్కాలికంగా ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తున్నా విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్య అందడం లేదని వాపోయారు. ఈ సమావేశంలో నగర నాయకులు ఉదయ్, మనోజ్, త్రినాథ్, పూజ, సింధు, స్వాతి, నేహ, మహేష్ ,రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం

ఖమ్మం మామిళ్లగూడెం: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొత్త కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలిపాక మాట్లాడారు.గతంలో ట్రైబల్ వెల్ఫేర్ వారు 20 రోజులు సమ్మె చేస్తే మంత్రి సీతక్క క్రమబద్ధీకరణ చేయించారని, ఆశావర్కర్లు సమ్మె చేస్తే వారి జీతాలు పెంచారని, సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చమంటే ఎందుకు నెరవేర్చట్లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పెళ్ళూరి విజయ కుమార్, బాసాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి టీ స్టాల్ ప్రారంభం



టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి టీ స్టాల్‌ను శనివారం ఎంపీడీఓ ఎం.యర్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యాన అనేక పథకాలు ప్రవేశపెడుతుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు రాజారావు, శ్రీలత, బి.చలపతిరావు, అశోక్‌రాణి, ఆలస్యం మధుసుదన్‌రావు, రవి, వంగవీటి నాగేశ్వరరావు, రాయపూడి నవీన్, బొడ్డు బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామానికి చెందిన బస్వాజి నాగమ్మ, నాయిని అపర్ణలకు శనివారం అందించినట్లు మాజీ ఉపసర్పంచ్ చెరుకూరి పూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంప్రసాద్, మాధంశెట్టి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్యాధికారి నిరోషా శనివారం పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని పరిశుభ్రతపై అవగాహన చెప్పారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం వసతి గృహం సంక్షేమాధికారి ఓదెలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సింగారెడ్డిపాలెంలోని గురుకుల బాలికల పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్, గురుకుల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భారీ మోటార్ సైకిల్ ర్యాలీ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నికల శంఖారావం మోగింది. ఖమ్మం పట్టణ సంఘ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా యలమందల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాస్ పోటీ చేసేందుకు నామినేషన్ ప్రక్రియలో భాగంగా శనివారం ఖానాపురంలోని శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించాక నగరంలో 200 మోటార్ సైకిళ్లతో ర్యాలీ తీశారు. అనంతరం సరిత క్లినిక్ సెంటర్‌లోని నాయీ బ్రాహ్మణ కాలనీలో గల కమ్యూనిటీ హాల్‌కు చేరుకున్నాక జగదీష్ మాట్లాడుతూ.. సంఘాన్ని బలోపేతం చేస్తూ, ప్రతీ సమస్యను పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రాము, సురభి సైదులు, విజయ్, తుపాకుల కృష్ణ, రాసమల్ల నరసింహారావు, యలమందల కోటయ్య, గుళ్లపల్లి నరేష్, అద్దంకి పాపారావు, యలమందల శ్రీనివాస్, శ్రీకాదా శ్రీనివాస్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కూసుమంచి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యాన శనివారం కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండెపొంగు మల్లేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో మెనూ చార్జీలు పెంచకుండా నాణ్యమైన భోజనం అందించాలంటే ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. భోజనం వండే కార్మికులకు సక్రమంగా బిల్లులు, వేతనాలు రాక అష్టకష్టాలు పడుతున్నారని, వారు అప్పులు తెచ్చి వండి పెడుతున్నారన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల నాయకులు కోటమ్మ, కృష్ణకుమారి, నందిని, లక్ష్మి, సునీత, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మూలం సంత ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వీడీవోస్ కాలనీలో ఉన్న సమీకృత మార్కెట్‌లో ప్రతీ నెల మొదటి ఆదివారం గ్రామ భారతి తెలంగాణ, శ్రీపుష్టి ఆర్గానిక్స్, ఇండస్ క్లౌడ్ ఫార్మింగ్ ఆధ్వర్యాన సేంద్రియ ఆహార ఉత్పత్తులను విక్రయించేలా మూలం సంతను ఏర్పాటు చేశారు. మట్టి ఆభరణాలతో పాటు ఆయుర్వేద మూలికలు, సాహిత్యం, కుల, చేతి వృత్తులు, ప్రకృతి వ్యవసాయదారులు పండించిన ఆహార పంటలను విక్రయించేందుకు నేడు ఈ మూల సంతను ప్రారంభించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సంత నిర్వహించబడుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని గాంధీచౌక్ సబ్ స్టేషన్ 11 కేవీ గుట్టల బజార్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏఈ క్రాంతి సింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గాంధీచౌక్, రైల్వే స్టేషన్ రోడ్, సుందర్ టాకీస్ రోడ్, మోహన్ రోడ్, వాసవీ నగర్, జహీర్ పురతండా, కిన్నెరసాని డౌన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే రామాలయం సబ్ స్టేషన్ పరిధిలోని రామాలయం ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సెక్షన్–5 ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రామాలయం, రిక్కాబజార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

వెల్లివిరిసిన మత సామరస్యం



అన్నదాన కార్యక్రమంలో ముస్లిం కుటుంబం

కామేపల్లి: మతసామరస్యం వెల్లివిరిసేలా ఓ ముస్లిం కుటుంబం తిరుపతమ్మ మాలధారులకు అన్నదానం చేశారు. మండలంలోని తాళ్లగూడెంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి గోపయ్య స్వామి దేవాలయంలో సుమారుగా 20 మంది మాలధారులకు శనివారం కారేపల్లి క్రాస్‌రోడ్డుకు చెందిన షేక్ జాన్‌సాహెబ్–పులాబీ దంపతులు తమ కుటుంబీకులతో కలిసి అన్నదానం చేశారు. మతసామరస్యంతో సోదరభావం పెంపొందించాలనే ఉద్దేశంతో భిక్ష నిర్వహించినట్లు జాన్‌సాహెబ్ తెలిపారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం ప్రారంభించారు. ఈనెల 2వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమైనందున ఉదయాన్నే అల్పాహారం అందించాలని దాతలు, పాఠశాల సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేసినట్లు పాఠశాల హెచ్ఎం డి.శ్రీదేవి తెలిపారు.

కేరళ హెల్త్ పాలసీ అమలు చేయాలి



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో కేరళ హెల్త్ పాలసీ తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో బోడేపూడి విజ్ఞాన కేంద్రం, సీపీఎం ఖమ్మం టూ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు భర్తీ చేసి ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. మెడికల్ క్యాంప్‌లో బీపీ, షుగర్, ఫిట్స్ తదితర సమస్యలపై వైద్యులు పరీక్షించి నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనిల్ కుమార్, రావళ్ళ రంజిత్, పిల్లలమర్రి సుబ్బారావు, రేష్మా దుర్గా, పి.రాజేష్, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు వై.శ్రీనివాసరావు, పి.ఝాన్సీ, పారుపల్లి అరుణ, ఎం.సుబ్బారావు, ఒ.అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, బోడపట్ల సుదర్శన్, నర్రా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

త్రీటౌన్‌లో మట్కా జూదాన్ని అరికట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: త్రీటౌన్ ప్రాంతంలో మట్కా జూదం విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారని సీపీఐ త్రీటౌన్ సమితి ఆధ్వర్యాన ఎస్ఐ రమేష్‌కు శనివారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్ మాట్లాడుతూ.. మట్కా జూదం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుని వీధుల పాలవుతున్నారని, దీనిపై పోలీస్ యంత్రాంగం దృష్టి సారించి అరికట్టాలని కోరారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు భూక్యా రవీందర్ మాట్లాడగా.. సీపీఐ సీనియర్ నాయకులు జెట్టి కృష్ణయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, త్రీ టౌన్ నాయకులు నామ విజయ్‌కుమార్, చిర్రా వెంకన్న, ప్రసాద్ ఉపేందర్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన గాడిచర్ల రజిత ఇటీవల మృతి చెందగా.. ఆమె కుటుంబానికి గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు శనివారం 50 కేజీల బియ్యం వితరణ చేశారు. గ్రామంలో ఎవరైనా నిరుపేదలు మరణిస్తే తన వంతు సాయంగా వితరణ చేసినట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, మాజీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సన్మానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని రోటరీనగర్‌లో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు నాగేంద్రబాబుకు శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడగా.. కార్యక్రమంలో పాఠశాల రిటైర్ హెచ్ఎం ఎం.మధు, హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు రామకృష్ణ, గాయత్రి, రమ, ఎం.పద్మ, సుజాత, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, చలపతిరావు, డి.రామారావు, డీవీ రామన్, విజయ్ అమృత్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

'గీతాంజలి' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మంసహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన గీతాంజలి విద్యానికేతన్ విద్యార్థులు గత నెలలో నిర్వహించిన ఆలిండియా మై చాంప్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు తెలిపారు. ఈ టెస్ట్‌లో 2,500 మంది పాల్గొనగా.. మ్యాథ్స్ విభాగంలో వి.నాగసాత్విక్, ఆర్.భువన ఆదర్శ్, కె.నిత్యశ్రీ సైన్స్ విభాగంలో కె.విశ్వక్‌తేజ్, కె.నిత్యాశ్రీ, వి.నాగసాత్విక్, ఎ.దేవన్‌సాయి ప్రతిభ చాటగా వారిని పాఠశాల డైరెక్టర్ టి.పద్మ, టి.అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

'పరిశ సీతారత్నం' సేవలు అభినందనీయం



సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: విద్యారంగం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చేయూతనిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఖమ్మం సీడీపీఓ బుర్రా వీరభద్రమ్మ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కొత్తూరు–2 అంగన్‌వాడీ కేంద్రంలో ట్రస్ట్ ఆధ్వర్యాన గర్భిణులకు సీమంతాలు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈమేరకు అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మాణం చేయాలని ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం సెక్టార్ పర్యవేక్షకులు మోతుక్కూరి కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు వి.శ్రీవెంకటనాగమణి, ఆయా సత్తెనపల్లి సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'బోనస్' కొల్లగొట్టేందుకు..

ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా ధాన్యం తరలింపు

- చెక్‌పోస్టు వద్ద తనిఖీలు శూన్యం
- ఫ్లెక్సీకే పరిమితమైన కేంద్రం
- కనిపించని సిబ్బంది



కొంగర వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం తనిఖీ కేంద్రం

నేలకొండపల్లి: తెలంగాణలో ధాన్యానికి ప్రభుత్వం అందించే బోనస్‌ను కొల్లగొట్టేందుకు ఏపీ అక్రమార్కులు భారీ ఎత్తున ధాన్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నారు. జిల్లాలోని ముదిగొండ మండలం వల్లభి చెక్‌పోస్టు నుంచి నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి మీదుగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు తరలిస్తున్నారు. కాగా ఇటీవల వల్లభి, చెరువు మాధారం గ్రామం వదద్ద ఏపీకి చెందిన ధాన్యం లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈనేపథ్యాన అధికారులు రాష్ట్ర సరిహద్దుల వద్ద ప్రత్యేకంగా ధాన్యం తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

దర్జాగా రవాణా..

మండలంలోని కొంగర గ్రామ క్రాస్ రోడ్డు వద్ద అప్పలనరసింహాపురం, కట్టుకాచారం, కొంగర, రాయగూడెం నాలుగు గ్రామాలను కలిపే చోట ప్రత్యేకంగా ఏర్పాటు ధాన్యం తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ఫ్లెక్సీ మినహా తనిఖీలు లేవు.. అసలు సిబ్బంది లేరు. దీంతో ఏపీ అక్రమార్కులు అక్రమ మార్గం సుగమంగా మారింది. దీంతో చీకటి పడితే చాలు ఏపీ నుంచి ధాన్యం లారీలు దర్జాగా తెలంగాణలోకి తీసుకొస్తున్నారు. ఫ్లెక్సీకే పరిమితమైన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిఘా లేకపోవడమే ప్రధాన కారణమని పలువురు ఆరోపిస్తూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ధాన్యం తనిఖీ కేంద్రం వద్ద సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.